

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ



**హై దునియా ఉసీకీ, జమానా ఉసీకా**

**మొహబ్బత్ మె జో హో గయా కిసీకా...**

'కాశ్మీర్ కీ కలీ' సినిమాలోనిది ఈ పాట. ఓ.పి.నయ్యర్ సంగీత దర్శకత్వంలో మహమ్మద్ రఫీ అత్యద్భుతంగా గానం చేసిన ఈ పాటను రచించింది ఎస్.హెచ్.బిహారి. కొన్ని పాటలు వింటూంటే మన కళాకారుల సృజనాత్మక ప్రతిభ పట్ల అంతులేని ఆశ్చర్యం కలుగుతుంది. అలాంటి పాటల్లో ఈ పాట ఒకటి. నాయకుడు అంతవరకూ తాను ఐశ్వర్యవంతుడనని అనుకుంటాడు. కానీ తాను ఆ ఐశ్వర్యానికి అసలు వారసుడు కాడు, అసలు ఆ ఐశ్వర్యం తామింతకాలం పేద అమ్మాయి అనుకుంటున్న నాయికదని తెలుస్తుంది. అంటే ప్రేమించినప్పుడు అతడు ధనవంతుడు. యజమాని. ఆమె పేద. కానీ నిజం తెలిసే సరికి ఆమె యజమాని అవుతుంది. అతడు పేద, అనాధ. ఈ చేదు నిజం తెలిసిన తరువాత నాయకుడు నిరాశ నిస్పృహల్లో మునుగుతాడు. బార్‌కి వెళ్లి తాగుతాడు. పాట అందుకుంటాడు. ఇలాంటి సందర్భాలలో పాడేది విషాద గీతమే అయి ఉంటుంది. 'హై దునియా ఉసీకే' పాట వింటూంటే విషాద గీతమని స్పష్టంగా తెలుస్తుంది. మహమ్మద్ రఫీ స్వరంలో విషాదంతో పాటు మద్యం మత్తు కూడా ధ్వనిస్తూంటూంది. పాటలో పల్లవికీ పల్లవికీ నడుమ సాక్సోఫోన్ మహమ్మద్ రఫీ స్వరంతో పోటీ పడుతూ విషాదాన్ని, మత్తునూ ధ్వనిస్తుంది. ఒక కోణంలోంచి చూస్తే పాట రఫీ స్వరానికీ, సాక్సోఫోన్‌కూ నడుమ 'జుగల్ బందీ'లా 'పోటీ'లా అనిపిస్తుంది. పాటలో వాయిద్యాలను వీలయినంత తక్కువగా ఉంచి, సాక్సోఫోన్ మరింత స్పష్టంగా వినిపించేట్టు రూపొందించి పాట ప్రభావాన్ని ఓ.పి నయ్యర్ ఇనుమడింప చేశాడు. ఈ పాట ఎన్ని మార్లు విన్నా తనివి తీరదు. వింటున్న కొద్దీ ఇంకా ఇంకా వినాలనిపిస్తూంటూంది.

పాట బాణీని, రఫీ గానాన్ని, సాక్సోఫోన్ విషాదంలోని మత్తును పక్కన పెట్టి పాటలోని పదాలు చిలికే భావాల గురించి ఆలోచిస్తే, అనూహ్యమైన విషయం స్పష్టమవుతుంది. గేయ రచయితగా ఎస్.హెచ్.బిహారీ చేసిన చమత్కారం బోధ పడుతుంది. ఇక్కడే మామూలు గేయరచయతలకు, ప్రతిభావంతులయిన గేయ రచయితలకు తేడా తెలిసేది.

మామూలు గేయ రచయితలు సందర్భాన్ని అనుసరిస్తూనే పాటలో సార్వజనీన భావాలు ప్రదర్శించటం ద్వారా పాట సినీ సందర్భాన్ని దాటి శ్రోతకు నిత్య జీవితంలో అన్వయించుకునే ఎవర్‌గ్రీన్ పాటలుగా మలుస్తారు.

'మేరే సనమ్' సినిమాలో నాయిక దుఃఖిస్తూంటే , ఆమెను ఓదారుస్తూ నాయకుడు పాటపాడతాడు. ఇలాంటి సందర్భాలలో 'నీ కంట నీరు నేను చూడలేను ' లాంటి భావాలతో పాటలు రాయవచ్చు. కానీ మజ్రూహ్ సుల్తాన్ పురి, విశ్వవ్యాప్తంగా ప్రేమికులకు బహుమతిగా పాట నిచ్చాడు. ఎవరైనా ప్రేయసి కంటనీరు తుడుస్తూ ఈ పాట పాడవచ్చు.

**టుక్డే హై మేరే దిల్‌కే, ఏ యార్ తెరే ఆసూ**

**దేఖీ నహి జాతీహై, దీదార్ తెరే ఆసూ.**

ఆమె కంటినుండి ప్రవహించే కన్నీరు అతడి హృదయపు తునకలట. కరగని ప్రేయసి ఉండదు. రెండవ పాదం సామాన్యమే. 'నీ కంట నీరు నే చూడలేను' అంటున్నాడు. కానీ మొదటి పాదంతో హృదయాన్ని దోచేస్తాడు. 'నీ కన్నీళ్లు నా హృదయపు తునకలు' అనటంతోటే వారిద్దరి నడుమ ఉన్న గాఢమైన ప్రేమ, ప్రేమ తీవ్రతలు తెలుస్తున్నాయి.

తన పరిస్థితికి దుఖిస్తూ నాయకుడు పాడే పాటలు కూడా బోలెడున్నాయి.

**యె ఆసూ మేరే దిల్‌కీ జుబాన్ హై**

**మై రోవూ తో రోదే ఆసూ, మై హస్ దూతో హస్బే ఆసూ**

'హమ్ రాహీ' సినిమాలో రఫీ పాట ఇది. హస్రత్ జైపురి గేయ రచయిత. అతని హృదయపు స్వరంట అతని కన్నీళ్లు. 'జుబాన్' అంటే భాష, 'నాలిక' అని అర్థాలు. అంటే, అతని హృదయపు భాష అతని కన్నీళ్లట. అతను నవ్వితే కన్నీళ్లు నవ్వుతాయి. ఏడిస్తే ఏడుస్తాయి. 'నవ్వినా ఏడ్చినా కన్నీళ్లే వస్తాయి. ఎందుకంటే, హృదయం తన భావాల్ని వ్యక్తపరచేది కన్నీళ్ల ద్వారానే.

అయితే 'కాశ్మీర్ కీ కలీ' లో నాయకుడి విషాద పరిస్థితిని ఎస్. హెచ్. బిహారీ ఇలాంటి భావాలకు సంపూర్ణంగా భిన్నంగా వ్యక్తపరచాడు.

హై దునియా ఉసీకే, జమానా ఉసీకా

మొహబ్బత్ మే జో హోగయా హో కిసీకా.

పల్లవి వినగానే ఫ్లాబర్ట్ మాటలు గుర్తుకు వస్తాయి. 'Love is a spring time plant that perfumes every thing with its hope, even the ruins to which if clings '

ప్రేమ అన్నది వసంత కాలంలో విరిసే పరిమళ భరితమైన పుష్పం. అది ప్రతిదానికీ పరిమళాన్ని అద్దుతుంది. చివరికి, విఫలమైనా వదలని ప్రేమ భావన, విఫల ప్రేమ శకలాలకు కూడా పరిమళాన్ని అద్దుతుంది' అంటాడు ఫ్లాబెర్ట్. సరిగ్గా అలాంటి భావననే ఎస్.హెచ్. బిహారీ పాట ఆరంభంలోనే ప్రదర్శిస్తున్నాడు. నిజానికి ఈ పాటను సందర్భాన్ని బట్టి విషాదగీతం అనుకుంటాం. కానీ ఇది విషాద గీతం కాదు. అత్యద్భుతమైన ఆశావాదం అన్నది పల్లవిలోనే స్పష్టం చేస్తాడు గేయ రచయిత. చరణాలలో ఆశావాదాన్ని దాటి అత్యద్భుతమైన ఆధ్యాత్మకపు శిఖరాలను అధిరోహింపచేస్తాడు గేయ రచయత.

ఈ ప్రపంచం, ఈ విశ్వం సర్వం అతనిదే. ఎవరయితే ప్రేమలో తనని తాను మరొకరికి సంపూర్ణంగా సమర్పించుకున్నాడో అతడిదే ఈ విశ్వం అంతా. ప్రేమ అంటేనే సమర్పణ. అదీ సంపూర్ణ సమర్పణ. ఎంతగా అంటే 'నేను', 'నాది' అన్నదేదీ మిగలదు. వ్యక్తి తనని తను మరచిపోయి, తాను ప్రేమిస్తున్న వ్యక్తి అస్తిత్వంతో మిళితమై, తన అస్తిత్వాన్ని సంపూర్ణంగా నశింప చేసుకోవటం ప్రేమ. 'లైలా'ను మజ్ను ఎంతగా ప్రేమించాడంటే, భగవంతుడే వచ్చి 'నీ ప్రేమకు మెచ్చి నేను వచ్చాను' అంటే, నువ్వు లైలా రూపంలో రా అప్పుడు నీవైపు చూస్తాను' అనేంత తీవ్రమైన సర్వం విలీనమైన ప్రేమ. అలాంటి ప్రేమలో తనని తాను సంపూర్ణంగా మరచిపోయి అస్తిత్వం కోల్పోయిన వాడిదే ఈ ప్రపంచం, ఈ విశ్వం అంటున్నాడు కవి. సాధారణంగా ప్రేమ వెన్నంటి విషాదం ఉంటుందంటారు. కానీ అసలు సిసలైన ప్రేమలో, సర్వాన్ని సమర్పించుకున్న ప్రేమలో విషాదం అన్నది ఉండదు.

మీరా నె పియా విష్ కా ప్యాలా

విష్ కో భి అమృత్ కర్‌డాలా,

ప్రేమ క ఢాయీ అక్షర్ పఢ్‌కే మస్త్ కబీరా గాయే.

'ప్రేమ్ రోగ్' సినిమాలో పండిత నరేంద్ర శర్మ రచించిన అత్యద్భుతమైన గీతం ఇది. ప్రేమ భావనలో మీరా ఎంతగా మమేకమైందంటే, విషాన్ని కూడా అమృతంగా మార్చింది. 'ప్రేమ' అన్న రెండక్షరాలు చేర్చిన కబీర్ ప్రపంచానికి జ్ఞాన బోధ చేశాడు. అదీ అసలు ప్రేమ భావన. ఇక్కడ సంతోషం తప్ప విషాదం అన్నది లేదు. విషాదం ఉందంటే, ఆ ప్రేమ భావనలో ఏదో లోపం ఉన్నట్టే అన్నమాట. అందుకే, ఓ పక్క నాయకుడు విషాదంలో వుంటే, గేయ రచయిత, ఎవరయితే ప్రేమలో సర్వం కోల్పోతాడో, వాడిదే ఈ ప్రపంచం అంటున్నాడు. ఈ భావనను చరణాలలో మరింత విస్తృత పరచి పాట స్థాయిని హిమాలయాలకు ఎదిగించాడు గేయ రచయిత.

**లుటా జో ముసాఫిర్ దిల్ కే సఫర్‌మే**

**హై జన్నత్ యె దునియా ఉస్‌కీ నజర్‌మే**

**ఉసీనే హై లూటా మజా జిందగీ కా**

**మొహబ్బత్ మె జో హోగయా హో కిసీకా.**

ప్రేమ ప్రయాణంలో సర్వం కోల్పోయిన వాడి దృష్టిలో ఈ ప్రపంచం ఒక స్వర్గం. ప్రేమలో సర్వం కోల్పోయిన వాడు, పోగొట్టుకున్న వాడే జీవితంలో ఆనందాలన్నిటినీ కొల్లగొట్టినవాడు. పూర్తిగా అలవాటయిన ఆలోచనకు వ్యతిరేకమైన ఆలోచన. ప్రేమ విఫలమయితే, జీవితమంతా కన్నీళ్లు కారుస్తూ బ్రతుకుతాను,నీ తలపుల్లో విషాదంలో జీవిస్తాను వంటి భావనలు విఫల ప్రేమకు పరాకాష్టగా భావిస్తాం. కానీ ఇక్కడ కవి, ప్రేమలో సర్వం కోల్పోయినవాడు, సర్వం పోగొట్టుకున్న వాడిదే అసలు ఆనందమంతా అంటున్నాడు. అసలీ గేయ రచయిత విఫల ప్రేమ విషాదగీతం రాస్తున్నాడా? ఇంకేదైనా రాస్తున్నాడా? అన్న అనుమానం వస్తుంది. అది సమంజసమైన అనుమానమే. ఎందుకంటే, గేయ రచయిత ఇక్కడ రాస్తున్నది మాములు ప్రేమ గురించి కాదు. భగవంతుడికీ, భక్తుడికీ నడుమ ఉన్న అలౌకికమైన అద్వితీయమైన ప్రేమ గురించి. గేయ రచయిత హీరో విఫల ప్రేమను ప్రదర్శించేందుకు 'సూఫీ' తత్త్వాన్ని ఆశ్రయించాడు. శిఖరమానమైన ప్రేమను ప్రదర్శించాడు. ప్రియుడిని ఆరాధిస్తూ, అతడికోసం ఎదురు చూస్తూన్న 'రాధ' భావనలో విషాదం లేదు. కృష్ణుడి దర్శనం కోసం పరితపిస్తూ, సర్వం విడిచి, పాటలు పాడుతూ దుమ్మూ ధూళిలో పొర్లుతూ, అందరి తిరస్కారాలకు గురవుతూ కూడా ఎవరూ అనుభవించలేనంత, అందుకోలేనంత అలౌకికానందంలో గడిపింది మీరా. అంటే, మానవుడిని మానవుడు ప్రేమించటంలో విషాదం ఉంటుంది కానీ, మనిషికీ భగవంతుడికీ నడుమ ఉండే ప్రేమలో ఆనందం తప్ప మరొకటి ఉండదు. ఆ ప్రేమలో వ్యక్తి సర్వం కోల్పోతాడు. అందరికీ దూరమౌతాడు. ప్రపంచాన్ని

విస్మరిస్తాడు. ఇదే సినిమాలో మరో పాటలో ఎస్ హెచ్ బిహారీ, ‘ ఖుద్ కో ఖోకర్, తుఝ్ కో పాయా’ అంటాడు. అంటే, తనని తాను సంపూర్ణంగా కోల్పోయాడు కానీ, ఆమెను పొందాడన్నమాట. అహంకారం వున్నచోట అసలు ప్రేమవుండదు. అస్తిత్వం వున్నచోట సంపూర్ణ అర్పణ వుండదు. అలా తనని తాను ప్రేమలో కోల్పోయినవాడే జీవితంలో ఆనందం అన్నదేదైతే ఉందో, అది అనుభవిస్తాడు. ఉసీనే జొ లూటా మజా జిందగీకా....

**హై సజ్దే కె కాబిల్, హర్ వో దివానా**

**కెజో బన్‌గయా హో తస్వీర్ – ఎ– జానా**

**కరో ఎహత్రాం ఉస్కా , దీవాన్‌గీకా**

**మొహబ్బత్ మెజో హోగయా హో కిసీకా.**

ఇంకా గేయ రచయిత ప్రదర్శిస్తున్న అలౌకికానందాన్నిచ్చే ఆధ్యాత్మక ప్రేమ గురించి ఎవరికయినా సందేహం ఉంటే రెండో చరణంలో దాన్ని పటాపంచలు చేస్తున్నాడు గేయ రచయిత. 'సజ్దా' అన్నది ఇస్లామీయులు భగవంతుడి సమక్షంలో మోకరిల్లటాన్ని, వంగి నమస్కారం చేయటాన్ని సూచిస్తుంది. 'కాబిల్' అంటే అర్హత. 'హై సజ్దేకి కాబిల్' అంటే, అలా వంగి నమస్కారం పొందే అర్హత ఉన్నవారు. ఎవరు వారు అంటే 'హర్ వో దివానా, లకెజో బన్గయా హో, తస్వీర్ – ఎ – జానా. ఎవరయితే 'తస్వీర్ – ఎ– జానా..' తస్వీర్ అంటే చిత్రపటం. 'జానా' అంటే ప్రేయసి, ఆత్మ అన్న అర్థాలు వస్తాయి. 'తస్వీర్ – ఎ – జానా ' అంటే ప్రేయసి చిత్రపటం. 'సూఫీ'లో 'తస్వీర్ – ఎ–జానా ' అంటారు. అంటే ప్రేయసి గురించి ఆలోచనల్లో సంపూర్ణంగా నిమగ్నమవటం. మరో పదం ఉంది 'తస్వీర్ – ఎ – నజ' అని. ఈ పదం అర్థం మరణానుభవ చిత్రపటం. అంటే తనని తాను సంపూర్ణంగా కోల్పోయిన భావం. ఈ రెండు పదాలను కలిపి 'తస్వీర్ – ఎ – జాన ' అన్నాడు గేయ రచయిత. అంటే తన ప్రేయసి చిత్రపటాన్ని సంపూర్ణంగా తనలో ప్రతిష్ఠించుకున్నవాడు, ఎంతగా, అంటే తనకూ ఆమెకు నడుమ భేదం లేకుండా తానే ఆమె చిత్రపటంలా అయిపోయినవాడు అన్న అర్థం వస్తుంది. మరణం అన్నది అస్తిత్వం కోల్పోవటం. ఆ రకంగా తన అస్తిత్వాన్ని కోల్పోయినవాడు. అలాంటి పిచ్చి వాళ్లందరికీ 'సజ్దా' చేయమంటున్నాడు కవి. వారి పిచ్చిని గౌరవించమటున్నాడు. ప్రేయసిలో సర్వం కోల్పోయి తనే ప్రేయసి అవటం అంటే, భగవంతుడి భావనలో సర్వం కోల్పోయి తనకూ భగవంతుడికీ నడుమ తేడా లేదని గ్రహించటం 'త్వమేవహం ' 'అహం బ్రహ్మాస్మి' స్థాయి అన్నమాట. అందుకే దైవ భావనలో ప్రపంచాల్ని విస్మరించిన వారినే దైవంలా కొలుస్తాం. రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి, అరబిందో వంటి వారిని దైవంలా భావించి ఆరాధిస్తాం. వీరు దైవభావనలో తమని తాము

కోల్పోయి, సంపూర్ణంగా తను అస్తిత్వాన్ని సమర్పించుకుని దైవంతో సమానమైన వారు. అర్ధంకాని వారికి అది తీవ్రమైన ప్రేమ పిచ్చిలా కనిపిస్తుంది. అర్ధమైన వారికి దైవత్వం బోధపడుతుంది. అందుకే అలాంటి పిచ్చివారిని గౌరవించండి అంటున్నాడు కవి. ఇక్కడ 'పిచ్చి' అంటే 'పిచ్చి' కాదు, అజ్ఞానులకు 'పిచ్చి'లా తోచే దివ్యత్వ భావనలో సంపూర్ణంగా కోల్పోయిన అసలైన ప్రేమికులు అన్న అర్ధం. ఇప్పుడు పాట స్థాయి మారిపోయింది. పాట భావన మారిపోయింది. హీరో క్లయిమాక్స్‌లో తాగి పాడుతున్నాడా, ప్రేమ మత్తులో మునిగిపోయి, ఆధ్యాత్మక మత్తులో విశ్వాన్ని విడిచి, సంపూర్ణానందంతో గానం చేస్తున్నాడా అనిపిస్తుంది.

బర్బాద్ హోనా జిస్కీ ఆదాహై

దర్ద్ – ఎ – మొహబ్బత్ జిస్‌కీ దవాహై

సతాయేగ క్యాగం ఉసే జిందగీకా

మొహబ్బత్ మె జో హో గయా హో కిసీకా.

'hitting the last nail' అంటారు. ఏదైనా వాదనలో చివరికి తిరుగులేని అంశాన్ని ప్రస్తావించి ప్రతి వాదన లేకుండా చేయటాన్ని ఈ పదబంధంతో సూచిస్తారు. అలాంటిది ఈ చివరి చరణం. సర్వనాశనమవటం దేని లక్షణమో, ప్రేమలోని తీవ్ర వేదన దానికి విరుగుడులాంటి ఔషధమో, అలాంటి వాడిని ఈ ప్రాపంచిక దుఃఖాలు ఏం చేస్తాయి అంటున్నాడు కవి. చేతులెత్తి దండం పెడితే సరిపోదు కవికి. పొర్లుడు దండాలు పెట్టినా సంతృప్తి కలగదు. ప్రేమ భావనలో తనని తాను కోల్పోయాడు. ఇల్లూ వాకిలి వదిలేశాడు. పడని తిప్పలు లేవు. నిద్రాహారాలు లేవు. నిరంతరం ప్రేయసి ధ్యాసనే. ప్రపంచం అతడిని వెక్కిరిస్తుంది. దూషిస్తుంది. రాళ్లతో కొడుతుంది.

**కొయీ పత్థర్ సే న మారే, మెరే దీవానేకో**

తన ప్రియుడి పైకి ప్రజలు రాళ్ళు విసురుతూంటే ప్రేయసి అడ్డుగా నిలచి రాళ్లతో నా ప్రియుడిని కొట్టకండి అని పాడుతుంది. కానీ ఈ గ్రహింపు కూడా ఉండదు ప్రేమికుడికి. ప్రేయసి నామం జపిస్తూ తిరుగుతూనే ఉంటాడు. బయట ప్రపంచానికి వాడు పిచ్చి వాడయినట్టు, దుర్భరమైన వేదనలో ఉన్నట్టు తోస్తుంది. అని అంతగా ఆనందించేవాడు మరొకడుండడు. ఇతరుల దృష్టిలో అతని రోగలక్షణం సర్వం నాశనం అవటం, దానికి మందు దుర్భరవేదన. ఇక వాడిని

ఈ ప్రపంచంలో ఏ దుఃఖం తాకలేదు. ఏ బాధ బాధించలేదు. వాడికి సంపూర్ణమైన ఆనందం వస్తుంది. ఇదీ ప్రేమ భావన. అలాంటి ప్రేమ అసలు ప్రేమ. భక్తులకు భగవంతుడిపై ఉండే ప్రేమ. సూఫీ ప్రేమ భావన ఇది.

ఇక్కడే మన కళాకారుల గొప్పతనం తెలుస్తుంది. సన్నివేశానికి తగ్గట్టు ఏదో పాట రాయవచ్చు. కానీ మామూలు పాటలు మామూలు కళాకారులు రాస్తారు. అసలైన కళాకారులు సన్నివేశం స్థాయిని పెంచుతారు. సినిమా విలువను పెంచుతారు. ప్రజల ఆలోచన స్థాయిని పెంచుతారు. ఉత్తమ ఆలోచనలనిస్తారు. ఇదీ అసలైన కళాకారులు, సామాజిక బాధ్యత కల కళాకారులు, ఉత్తమ సంస్కారం కల కళాకారులు చేసే పని.

ఈ పాటను ఓపి నయ్యర్ రూపొందించిన విధానం అద్భుతంగా ఉంటుంది. పైన చూస్తే విషాద గీతం. ఆలోచిస్తే, అలౌకికానందాన్ని వ్యక్తపరిచే గీతం. ముఖ్యంగా, చరణాల నడుమ సాక్సోఫోన్ వాదకం గమనిస్తే సాక్సోఫోన్ రెండు రకాల పనులు చేస్తుంది. బాణీలోని విషాదాన్ని ఇనుమడింపచేస్తుంది. అదే సమయంలో పాటలోని పదాలలో ఉన్న మార్మికమైన ఆనంద భావనను తలపింప చేస్తుంది. ఈ పని చేయటంలో రఫీ స్వరం పలికే భావాలకు ఉద్దీపననిస్తూ, రఫీతో పోటీపడుతున్న భావనను కలిగిస్తుంది. రఫీ కూడా పాట ఆరంభం నుంచీ ఓ వైపు విషాదాన్ని, మరోవైపు ఆధ్యాత్మికానందాన్ని ప్రదర్శించే రీతిలో పాడుతూ పాట మార్మికతను మరింత ఉద్దీపితం చేస్తాడు. 'హై దునియా' అని ఆరంభంలోనే గమ్మత్తుగా పాడతాడు. 'ఉసీకీ, ఉసీకా' లను పలకటంలోని తేడాను గమనిస్తే, రఫీ పాటను, సందర్భాన్ని, నటుడిని సంపూర్ణంగా అర్థం చేసుకుని పాడినట్టు స్పష్టంగా తెలుస్తుంది. 'మొహబ్బత్' పదం పలికిన తీరు మార్మికతను పెంచుతుంది. ఏ ప్రేమ గురించి పాడుతున్నాడన్న అనుమానం ఇక్కడే వస్తుంది. ఇక పాటలో ప్రతి పదాన్ని ఉచ్చరిస్తూ రెండు రకాల భావనలను, భౌతిక ప్రేమలోని విషాదాన్ని, ఆధ్యాత్మిక ప్రేమలోని ఆనందాన్ని ఒకేసారి పలికిస్తూ, రెండర్థాలనిచ్చే రీతిలో స్వరాల్ని పలికించటం మానవ మాత్రులకు సాధ్యం కాదు. శమ్మీ కపూర్ నటనలో కూడా ఆనంద విషాదాలు కలగలిసి కనిపిస్తాయి. నడుమ భజనకు భక్తి భావనతో ఊగినట్టు, భక్తిగీతం పాడుతూ సూఫీలు నృత్యం చేసినట్టు చేయటం శమ్మీకపూర్ సైతం పాట గొప్పతనాన్ని అనుభవించి, పలవరించి తెరపై ఆభావనలను ప్రదర్శించాడని అర్థమవుతుంది. ఇది ఆనాటి కళాకారుల గొప్పతనం. వారు డబ్బు తీసుకుని పనిచేసి ఉండవచ్చుగాక. వారి కళా సృజన మాత్రం ఆత్మ సంతృప్తి కోసమే. లేకపోతే ఓ కమర్షియల్ సినిమాలో, మామూలు సందర్భంలో ఇలాంటి అసాధారణమైన రీతిలో గేయ సృజన చేయాల్సిన అవసరం ఏముంది? ప్రేక్షకుల స్థాయిని దిగజార్చి పబ్బం గడుపుకునే బదులు ప్రేక్షకుల కోసం అత్యుత్తమ కళా సృజన ద్వారా తమ స్థాయిని పెంచుకుంటూ, ప్రేక్షకుల స్థాయిని పెంచుతూ, సమాజంలో అత్యున్నత భావనలను వెదజల్లటం ఎందుకు? ఎందుకంటే వాళ్లు అసలైన కళాకారులు కాబట్టి. దిగజారుడు కళను ప్రదర్శించి తమను తాము అవమానించుకోవటమే కాక కళను కూడా అవమానించటం అన్న ఆలోచన వారి దరిదాపులకు

కూడా రాదు కాబట్టి. అందుకే ఆనాటి పాటలు ఈనాటికీ సజీవంగా తరతరాల మనస్సుల్లో స్థిరంగా ఉన్నాయి. ఉంటాయి. 'కరో ఎ హెత్ రామ్ ఉస్ కీ దీవాన్గీ కా' ఈనాటి కళాకారులకు 'పిచ్చితనం' లా తోచే ఆనాటి కళాకారుల అత్యుత్తమ కళా సృజనను అందించాలనే ద్రుఢ నిశ్చయానికి, పట్టుదలకు, హృదయానికి వేనవేల ప్రమాణాలు అర్పించాల్సి ఉంటుంది.

(మరిన్ని మధురమైన పాటలతో వచ్చే నెల.)

Click here to share your comments